




















మంత్రి జోగి రమేష్‌ను కలిసిన తెలంగాణ మంత్రి



తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మంత్రి జోగి రమేష్ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కొండపల్లి బొమ్మ అందజేసి అభినందించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జోగి రాము, నల్లమోతు మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 1995–1998 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. కళాశాలలో తమ తోటి విద్యార్థులతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన అధ్యాపకులను, ప్రస్తుత కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావును సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు చంద్రశేఖర్, మట్టం రాజుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది.

ఎమ్మెల్యే వసంత సంక్రాంతి శుభాకాంక్షలు

మైలవరం: ప్రజలందరికీ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ సంక్షేమాభివృద్ధి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో మైలవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు సంక్షేమం కోసం సుమారు రూ.900 కోట్లు చెల్లించామని తెలిపారు. అభివృద్ధి పనులకు రూ.300 కోట్లు మంజూరు చేశామని అన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

1న ధ్యాన మందిరం ప్రారంభం

మైలవరం: స్థానిక శ్రీకంచి కామాక్షిదేవి ఆలయం పక్కన నిర్మించిన శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరం వచ్చేనెల 1న ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వంశస్తులు శ్రీవీరభద్రస్వామి, లక్ష్మీ భ్రమరాంబిక దంపతులు హాజరవుతారన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి సుప్రభాత సేవ, అభిషేకం, సహస్రనామార్చనలు, వివిధ భక్త సమాజముల ఏకనామ సంకీర్తన, భజనలు, హనుమాన్ చాలీసా, చివరి రోజు స్వామివార్ల కల్యాణం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

23న సొసైటీ పాలకవర్గం ఎన్నిక

పైడూరుపాడు (విజయవాడ రూరల్): పైడూరుపాడు గ్రామంలోని మత్స్యకారుల సొసైటీ పాలకవర్గం ఎన్నిక ఈ నెల 23వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అఖిల తెలిపారు. గ్రామానికి చెందిన 56 మంది ఓటర్లు మత్స్యకారుల సొసైటీలో ఉన్నారన్నారు. ఈ సభ్యులు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుందని వివరించారు. 2023వ సంవత్సరంలో ఎన్నికయ్యే నూతన పాలకవర్గం అయిదేళ్ల పాటు అధికారంలో కొనసాగుతుందని పేర్కొన్నారు.

కోడి పందేల బరి ధ్వంసం



మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. మండలంలో కోడి పందేల బరులు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటిని ధ్వసం చేస్తామన్నారు. సెక్షన్ 30 పోలీస్ యాక్టు 144 సీఆర్‌పీసీ అమల్లో ఉందని, కోడి పందేలు, చట్ట వ్యతిరేకమైన ఆటలు ఆడించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాంబాబు హెచ్చరించారు.

నూజివీడు ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు

నూజివీడు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు లోగిళ్లల్లో ఆనందాలు పంచే సంక్రాంతిని ప్రజలందరూ సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. పాడిపంటలతో, భోగభాగ్యాలతో తులతూగాలన్నారు. ప్రజలు జూదాలకు దూరంగా, కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకోవాలన్నారు.

మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య మృతి బాధాకరం

ఇబ్రహీంపట్నం: మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లిమర్ల వరప్రసాద్ అన్నారు. రెడ్డయ్య మృతిపై ఓబీసీ సంఘం తరపున ఇబ్రహీంపట్నంలో శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తొలిసారిగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టిన మొదటి వ్యక్తి రెడ్డయ్య అని కొనియాడారు. ఆయన మృతి బలహీన వర్గాల హక్కుల ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే పార్థసారధి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.








ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రక్షణనిధి
- నూతిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమం, అభివృద్ధిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నూతిపాడు (విస్సన్నపేట): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో నూతిపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. బ్రోచర్లు అందజేశారు. వేమిరెడ్డిపల్లి పంచాయతీలో 6013 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.15,09,16,189 అందజేశామన్నారు. విద్యుత్ వినియోగ దారులకు, రైతుల వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇచ్చిన హామీలకు మించి పేదలకోసం ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. నాడు-నేడు పనులు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది, మౌలిక వసతులు కల్పించామన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుక..

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఒకరోజు ముందుగా గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ పంతంగి విజయకుమారి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ వి సత్యనారాయణచారి, సొసైటీ అధ్యక్షుడు ఆర్ సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు నెక్కళపు సుబ్బారావు, నెక్కళపు శివయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు సూరా వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, మండల బీసీసెల్ అధ్యక్షుడు పంతంగి రమేష్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కే తిరుపతిరావు, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, మండల అధికారులు పాల్గొన్నారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర సహాయమాత ఉత్సవాలను పురస్కరించుకుని నవదిన ప్రార్థనలు శుక్రవారం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రీజనల్ సుపీరియర్ ఫాదర్ జోస్ పూజాబలిని నిర్వహించారు. ఈదర విచారణ గురువు ఫాదర్ అగస్టీన్, సహాయ గురువు ఫాదర్ ప్రకాశ్, గ్రామస్తులు, విశ్వాసులు, సంఘస్తులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన విశ్వాసులు ఈ కార్యక్రమానికి పెద్దెత్తున తరలి వచ్చారు. ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాటం



మండల కన్వీనర్ రవిని సన్మానిస్తున్న నాయకులు

చాట్రాయి: సామాజిక ఆర్థిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని ఆ శాఖ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం చాట్రాయిలో దళిత బహుజన నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఎన్నో సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నారని వర్గీకరణ సాధనే ఆయన ధ్యేయమని చెప్పారు. అనంతరం మండల కన్వీనర్‌గా మొలుగుమాటి రవిరామ్‌ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము ప్రసాదు, కలపాల రమేష్, సుజనరావు, కోట జోషి, ఘంటశాల మన్మథరావు, కారుమంచి ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు దుస్తులు అందజేత



దుస్తులను అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్

ఆగిరిపల్లి: సంక్రాంతి పురస్కరించుకుని నూజివీడులో బిస్ స్కూల్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆగిరిపల్లి, ఈదర జట్లకు ఆగిరిపల్లి భాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పీవీ శ్రీనివాసరావు శుక్రవారం క్రీడా దుస్తులను అందజేశారు. శ్రీనివాసరావు అందజేసిన క్రీడా దుస్తులను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ల చేతులు మీదుగా 25 మంది క్రీడాకారులకు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గయ్యపేట అర్బన్: ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకొని కాలిన గాయాలతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిన ఘటన పట్టణంలోని స్థానిక చెరువు బజారులో చోటుచేసుకుంది. ఎస్ఐ. బీవీ రామారావు కథనం ప్రకారం.. తాళ్లూరి మధు (33) ఈనెల 7న రాత్రి మద్యం తాగిన మైకంలో భార్యతో గొడవ పడి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 12 వ తేదీ రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రోన్లతో మరింత వేగంగా భూముల సర్వే

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



భూముల సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూముల సర్వేను డ్రోన్ల ద్వారా మరింత వేగంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పల్లెర్లమూడిలో డ్రోన్‌తో భూముల సర్వేను శుక్రవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 ఏళ్ల తరువాత రాష్ట్రంలోని భూములన్నింటినీ ప్రభుత్వం సర్వే చేయిస్తుందని, దీని ద్వారా భూ వివాదాలు సమసిపోవడమే కాకుండా, పక్కాగా భూములకు సంబంధించిన నూతన రికార్డులను తయారు చేస్తుందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మండలంలో సర్వే పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ భూములనే కాకుండా గ్రామాల్లోని గృహాలను, రోడ్లను గుర్తిస్తామన్నారు. సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ భూ యజమానులు తమ వద్ద ఉన్న భూముల రికార్డులు అందజేయాలన్నారు. తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, సర్పంచి పులపాక సౌమ్యరేఖ, ఎంపీటీసీ చిలుకూరి అనూర్ బాషా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వృద్ధులు

రెడ్డిగూడెం: అశ్విని ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో అభ్యుదయ యువశక్తి సంఘంలో విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షులు చింతిరాల వెంకటేశ్వరరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ శిబిరంలో వైద్యులు పల్లెపాం లక్ష్మి, చింతిరాల ఫ్లారెన్సు 60 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ల నిమిత్తం విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సీహెచ్ సావిత్రి, కోశాధికారి తాళ్లూరి ఝాన్సి పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ



గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు



తిరువూరు రంగనాయకస్వామి ఆలయంలో గొబ్బెమ్మలకు పూజలు

తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో శుక్రవారం గోదాదేవికి ఎదుర్కోలు ఉత్సవం, సారె సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాస ముగింపు పురస్కరించుకుని రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానంలో సేవా కాలం, తిరుప్పావై అనంతరం గోదా-కృష్ణులకు ఎదుర్కోలు నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయంలో ఆవుపేడతో గొబ్బెమ్మలను చేసి పూజాదికాలు నిర్వహించారు. శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానం, శ్రీ కోదండ రామాలయం, జగన్నాథపురం కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో సేవాకాలం ఎన్‌సీహెచ్ విఠలాచార్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



యూటీఎఫ్ డైరీ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఉమ్మడి కృష్ణ జిల్లా గౌరవ అధ్యక్షులు డి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి పీ వీరకోటి, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ సుబ్రహ్మణ్యం, ఎం. బాలకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కట్టా రవిబాబు, కార్యదర్శి జి.డబ్ల్యూసీ శేఖర్, ఆడిటర్ సీహెచ్ లక్ష్మయ్య, కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరియనివాస్‌లో సంక్రాంతి వేడుకలు

నందిగామ: పట్టణ శివారు సిలువ గిరి సమీపంలో గల మరియనివాస్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు భోగి పండ్లు పోశారు. హరిదాసు వేషధారణతో పాటు పలు రకాల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా

వాలీబాల్ పోటీల విజేత ఈదర జట్టు



నూజివీడు: సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా ఈదర టైగర్స్ జట్టు, ద్వితీయ స్థానంలో పట్టణంలోని జోన్స్ జట్టు నిలిచాయి. ఈ జట్లకు బహుమతి ప్రదానోత్సవ డీవైఈవో సేవియా పాల్గొని నగదు బహుమతిని అందజేశారు. పోటీల నిర్వహణలో వ్యాయామోపాధ్యాయులు పీ.రవీంద్ర, సుకుమార్, అన్నామణి, లక్ష్మీ, ఆరతి, రాణి, నాగేశ్వరరావు, శివనాగేంద్ర రావు, రామచంద్రుడు, పుల్లారావు, ఆదర్శ్ బాబు, రాజ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి వితరణ

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ గోశాలకు శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన రైతు చింతా వెంకటరావు రూ. 7వేల విలువైన వరిగడ్డిని వితరణగా అందజేశారు. ఆలయ ఉద్యోగి శశి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యాచకురాలు మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని పీఎన్‌బీఎస్ బస్టాండ్‌లో గుర్తు తెలియని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యాచకురాలు మృతి చెందిన సంఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో యాచకురాలు సిటీ టర్మినల్ వైపు నుంచి బస్టాండ్‌లోని 34 ప్లాట్‌ఫామ్ వైపు నడచుకుంటూ వెళ్తుండగా పల్లెవెలుగు బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. మృతురాలి వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, వయస్సు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన క్రాఫ్ట్ మేళా

పటమట(విజయవాడతూర్పు): గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రదర్శనతో కూడిన మార్కెట్, కొనుగోలు మద్దతు అందించి సహకరించిన నాబార్డ్ వారి సాయం ఎంతో సంతృప్తి కలిగించిందని శిల్ప గురు జాతీయ అవార్డు గ్రహీత కె. గంగాధర్ అన్నారు. శుక్రవారం పటమట పంట కాల్వ రోడ్డులోని స్టెల్లా కాలేజ్ ఆడిటోరియంలో జరిగిన నాబార్డ్ హోం డీ క్రాఫ్ట్ మేళా ప్రదర్శన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళ, చేనేత వస్త్ర పరిశ్రమ, నైపుణ్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాబార్డ్ వంటి సంస్థల సహకారం అద్భుతమని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పోచంపల్లి, పొందూరు, వెంకటగిరి, మంగళగిరి, మహేశ్వరీ, కలంకారీ, కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతిలో కొనసాగుతున్న చేనేత వస్త్రాల తయారీకి తోడు చెక్కబొమ్మలు, గాజు, లెదర్, జూట్ వంటి ముడిసరుకుతో స్వల్పంలోనే పలు వస్తువులను తయారు చేయడంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేయడం ఈ ప్రదర్శనలో మరో ప్రత్యేకతని ఆయన అన్నారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయభాస్కర్ మాట్లాడుతూ మహిళా సంస్థల ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాబార్డు సంస్థ సహకారంతో ప్రదర్శనతో కూడిన అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఎస్. రెడ్డి, నాబార్డ్ డీజీఎం కేవీఎస్. ప్రసాద్ ఎం.ఎస్.ఆర్. చంద్రమూర్తి, మిళింద్ చౌసల్కర్, మేరాలాల్, మహంతి, హరీష్, స్థానిక బ్యాంకు కాలనీ, టీచర్స్ కాలనీ, పోస్టల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

గుణదల(విజయవాడ తూర్పు): మాదక ద్రవ్యాల కారణంగా యువత జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని నగర అడ్మిన్ డీసీపీ ఎం సత్తిబాబు అన్నారు. ఆంధ్ర లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల పై అవగాహనా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అలవాట్లను బట్టి మన అభివృద్ధి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వలన శారీరక అనారోగ్యంతో పాటు, మానసిక రుగ్మతలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాలకు బానిసలైన వారి జీవితాలు అంధకారంగా మారాయని పేర్కొన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాట్లు జీవితాలను ప్రమాదకర స్థితికి నడిపిస్తాయని తెలిపారు. గంజాయి సరఫరా చేసే అసాంఘిక వ్యక్తులపై పోలీసు విభాగం దృష్టి సారించిందన్నారు. నేరం రుజువైతే కఠిన శిక్షకు గురి కాక తప్పదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస రావు, ఎస్ఈబీ అధికారులు ప్రభాకర్, సుధాకర్, నిక్సన్, స్వామినాథన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు
- తోటపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



తోటపల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా బలపడుతున్నాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లిలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధితో ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయని వివరించారు. గ్రామంలోని చిన్న చిన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే అధికారుల ద్వారా త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మచ్చా హరిబాబు, తోటపల్లి ఎంపీటీసీ చింతా శ్యామల, నాయకులు బెజవాడ రాంబాబు, బెజవాడ హర్ష, రాజులపాటి శ్రీమన్నారాయణ, ఎంపీపీ అనూషా ఇసాక్, జెడ్పీటీసీ వీరబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సింహాద్రి నాగబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



తిరువూరు ఐడియాస్ సేవాసంస్థలో విజేతలకు బహుమతుల పంపిణీ



అక్కపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్



కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

తిరువూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తిరువూరు బస్టాండు సెంటర్లో ఐడియాస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. అక్కపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. విజేతలకు సర్పంచి రవికుమార్ బహుమతి ప్రదానం చేశారు. సెయింట్ ఆన్స్ స్కూలులో సంక్రాంతి పర్వదిన విశిష్టతను తెలుపుతూ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్, పాటల పోటీలు నిర్వహించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ముసునూరు: సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. చెక్కపల్లి చైతన్య స్కూలులో ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటలు వేసి, పొంగళ్ల వంటకాలు, చిన్నారులకు భోగి పళ్లు పోశారు. గాలి పటాలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగకు సంబంధించిన గంగిరెద్దుల ఆట, హరిదాసుని రంగభజన, తదితర చిన్నారుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వాసవి క్లబ్ ఉత్సవ్ గొల్లపూడి కపుల్స్ ఆధ్వర్యంలో స్థానిక పద్మలత కాలనీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వాసవియన్ మిత్తింటి శారద, జిల్లా గవర్నర్ మండా నంద్య డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్‌సీ గోవు రాము పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం రవి కిషోర్ హాజరయ్యారు. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షకార్యదర్శులు గట్టు సత్యనారాయణ, ప్రత్తి సాయి, కోశాధికారి కోట ఉదయ్‌కిరణ్, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం



2002-03 సంవత్సరం పూర్వ విద్యార్థులు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూలులో 2002-03 సంవత్సరంలో 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను స్మరించుకున్నారు. చదువు చెప్పిన 15 మంది గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆనాడు మేము చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఎవరికి వారే ప్రయోజకులు అయ్యారని పూర్వ విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.30 వేల విలువైన బెంచీలను ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో గోదా కల్యాణం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండంలో ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఉప కార్యనిర్వహణాధికారి పీ వెంకటయ్య, సూపరింటెండెంట్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరుగంటలకు వేదోక్తంగా కల్యాణక్రతువు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ భక్తులు పాల్గొనాలని కోరారు. కల్యాణమండప ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కంచికామకోటి పీఠం నిర్వహణలోని లబ్బీపేట వెంకటేశ్వరస్వామి దేవాలయంలోనూ గోదా కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. దేవాలయ ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి సుబ్రహ్మమణ్యం, మేనేజర్ శర్మ మరోక ప్రకటనలో తెలిపారు.

కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరానికి చెందిన వల్లూరు పూర్ణచంద్రరావు, కస్తూరిబాయి దంపతుల జ్ఞాపకార్థం ప్రారంభించిన కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ దశాబ్దకాలంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. బృందావనకాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫకీరుగూడెంలోని మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు యూనిఫాం, నోట్‌బుక్స్, షూస్ పంపిణీ చేశారు. ఇటీవల ఫకీరుగూడెంలో మరణించిన వారి నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా కొత్త ఫకీరుగూడెంలో రెండు నెలల కిందట అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన 17 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల సాయం, దుస్తులు అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్లగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సిద్ధార్థ అకాడమీ కోశాధికారి పాలడుగు లక్ష్మణరావు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లూరు రవీంద్రనాథ్, వల్లూరు అశోక్‌బాబు, చిలకపాటి ఉషారాణి-రాంప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు రకాల వ్యాధులు సోకకుండా చూడవచ్చని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. డివిజన్‌లోని 91వ సచివాలయం పరిధిలో సీతారామపురంలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ శానిటరీ, హెల్త్ సెక్రటరీతో కలిసి ఇంటింటికీ పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలు ఇళ్లలో డబ్బాలు, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారపోయించారు.

కారిడార్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఎయిర్‌పోర్టు కారిడార్ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రామరప్పాడు నుంచి గన్నవరం వరకు జాతీయరహదారి వెంబడి నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పనులను పరిశీలించి మెటీరియల్ త్వరగా ఏర్పాటు చేసుకుని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కారిడార్‌కు టైల్స్ అంచులు పగిలిపోవడం గమనించిన ఆయన అధికారులపై మండిపడ్డారు. నాణ్యతలో రాజీలేకుండా చర్యలు తీసుకోవాలని, టైల్స్ పగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు ఈఈ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

15 మందిపై బైండోవర్ కేసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో రాణిగారితోట, తారక రామనగర్ పరిసర ప్రాంతాలలో నివసించే 15 మందిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్టేషన్ పరిధిలో కోడి పందాలు, జూదాలకు పాల్పడే వారిని బైండోవర్ చేశారు. స్టేషన్ పరిధిలో కోడి పందాలు వేసేందుకు, జూదాలు ఆడేందుకు ఎటువంటి అనుమతి లేదని, దీనిని అతిక్రమించి కోడి పందేలు వేసినా, జూదాలు ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్టేషన్ సీఐ ఎం.వి.దుర్గారావు హెచ్చరించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు

ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ అజీజ్



జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న జిల్లా చీఫ్ కోచ్ అజీజ్

విజయవాడ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోనే క్రీడా ఆణిముత్యాలు ఉంటాయని, వారిని మరింత ప్రోత్సాహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ అన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు ఏ మాత్రం కొదవలేదని, వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తే జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా రాణిస్తారన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే జిల్లా స్థాయి అవుట్ డోర్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను చీఫ్‌కోచ్ అజీజ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ ఈడా వేదాద్రి తల్లిదండ్రులు ఈడా శకుంతల, సీతారామయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ నాన్ అవుట్ డోర్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పదేళ్లుగా ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువులతో పాటు ఉద్యోగాల్లోనూ ప్రత్యేకంగా రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ పోటీల్లో 50 జట్లు పాల్గొంటున్నాయని ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ ఈడా వేదాద్రి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, సుపీరియర్ ఫాదర్ జేమ్స్, మైకేల్, కప్పగంతుల రామకృష్ణ, సిస్టర్ మెర్సి, పోలుదాసు రంగనాయకులు, డైరెక్టర్లు మోహనరావు, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బెజవాడ రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో 50 మంది టీడీపీకి చెందిన యువకులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని దానికి ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ హర్ష, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ హరిబాబు, జెడ్పీటీసీ వీరబాబు, శ్రీమన్నారాయణ, శరత్, నాగబాబు, ఎంపీటీసీ శ్యామలాదేవి, హైమావతి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు



తలపడుతున్న నూజివీడు-ఏలూరు జట్లు

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 46వ స్మారక పురుషుల, మహిళల జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. పలు జట్లలో క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి తమ జట్లను విజయపథంలో నడిపించారు. పలు జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా జరగగా, కొన్ని మ్యాచ్‌లు ఏకపక్షంగా సాగాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తోన్న ఈ పోటీల్లో భాగంగా పోటీలు ముగిసే సమయానికి నాకౌట్ మ్యాచ్‌లు ముగిశాయి. ఈనెల 14న పురుషుల, మహిళల సెమీస్, ఫైనల్స్ మ్యాచ్‌లతో పాటు మూడు, నాలుగు స్థానాలకు మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణను ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ అంజాద్‌అలీ పర్యవేక్షించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



పోతురెడ్డిపల్లిలో బరిని ధ్వంసం చేయిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: కోడిపందేలు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ హెచ్చరించారు. మండలంలోని పోతురెడ్డిపల్లిలో కోడిపందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన బరిని శుక్రవారం ఆయన సందర్శించి స్తంభాలను తొలగింప చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోడిపందేలు నిర్వహణ చట్ట విరుద్ధమని అన్నారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తుంటే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఇది 24 గంటలు పనిచేస్తుందని, ఈనెల 17 వరకు కంట్రోల్ రూమ్ నెంబరుకు ఎవరైనా ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. కోడిపందేల నిర్వహణకు మండలంలోని పలు గ్రామాల్లో బరులను నిర్వాహకులు సిద్ధం చేశారు. పాతరావిచర్ల, తుక్కులూరు, పోతురెడ్డిపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో బరులను ఏర్పాటు చేసి పందేలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నారు.

కీసర టోల్‌గేట్ వద్ద పెరిగిన రద్దీ



కీసర టోల్‌గేట్ వద్ద భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

నందిగామ: సంక్రాంతి పర్వదినాల నేపథ్యంలో కంచికచర్ల మండలం కీసర స్వర్ణ టోల్‌గేట్ వద్ద శుక్రవారం వాహనాల రద్దీ అధికమయింది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో వివిధ గ్రామాలకు తరలి వెళ్లే వారి సంఖ్య గణనీయంగా ఉండటంతో టోల్ గేట్ కౌంటర్లు ఏ సమయంలో చూసినా రద్దీగానే కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఫాస్ట్ ట్యాగ్ అమల్లో ఉండటంతో గతంలో కూడా పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. వందల సంఖ్యలో వాహనాలు వస్తున్నప్పటికీ క్షణాల్లో వెళ్లిపోతున్నాయి. దీనికి తోడు పోలీసులు కూడా ప్రత్యేకంగా బీట్‌లు ఏర్పాటు చేశారు. దీనిపై స్వర్ణ టోల్‌వేస్ మేనేజర్ ఎం.జయప్రకాష్‌ను ప్రశ్నించగా సాధారణంగా నిత్యం 18 నుంచి 20 వేల వరకు వాహనాలు వస్తుంటాయని, గత రెండు రోజులుగా వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కీసర టోల్ ప్లాజా వద్ద మొత్తం వాహనాలు వెళ్లేందుకు 10 లైన్లు ఉన్నాయని, అన్ని కౌంటర్లలో ఫాస్ట్ ట్యాగ్ సౌకర్యం ఉందన్నారు. ఒక్కో వాహనం టోల్గేట్ నుంచి క్రాస్ అయ్యేందుకు కేవలం మూడు సెకండ్ల సమయం మాత్రమే పడుతుందన్నారు. గురువారం టోల్‌గేట్ నుంచి మొత్తం 28 వేల వాహనాల రాకపోకలు జరిగాయని, శుక్రవారం అర్ధరాత్రి దాటేంతవరకు ఇదే తరహాలో రద్దీ ఉంటుందన్నారు.

కందిపప్పు నాణ్యత పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కందిపప్పు నాణ్యతను సంబంధిత శాఖ అధికారులు పరిశీలించారు.అరండల్‌పేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని కార్డుదారులు, అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం కందిపప్పు ఉడికించి చూశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా పౌర సరఫరాల మేనేజరు స్వయంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న కందిపప్పు ప్యాకెట్టును కత్తిరించి, లబ్ధిదారులసమక్షంలోనేఉడికించారు. గ్యాస్ స్టౌపైన 12 నిమిషాలలో కందిపప్పు ఉడికిందని అధికారులు తెలిపారు. పప్పు నాణ్యత బా గుందని, లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. ఎండీ యూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న కందిపప్పును వినియోగించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు డి.కాశీనాథ్ కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌లోని శానిటేషన్,వాటర్, డ్రెయినేజీ వెహికల్‌డిపో, మలేరి యా, పార్క్, సిల్ట్, ఎస్ఎంఆర్, స్ట్రీట్ లైట్, క్లాప్, అటెండర్స్, యూసీడీ, సీఓపీలు విభాగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్వర్ణోత్సవ మహాసభల్లో 25 తీర్మానాలు ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు.